
# తెగినచెప్పు

## భాగవతుల సుబ్రహ్మణ్యం




లచ్చినాణ మొహం లంకణాలు చేస్సేసి, నెల్రోజుల్నించీ తిండి ఎరగనివాడు ఒక్కసారి పంచభక్ష పరమాన్నాలతో విందు భోజనం చేసి భుక్తాయాసం తీర్చుకుంటున్నవాళ్లా వుంది.

లచ్చినాణ అలా వుండడానికి కారణం ఆ రోజు ఫస్టు తారీక్కావడమే. ఫస్టున వచ్చిన జీతం అదే రోజు సాయంకాలానికి పుటం వేసి చూసినా కనిపించదు. ఎవడిక్కట్టాల్సింది వాడికి కట్టేగా, కాలరు పుచ్చుకొని నిలదీసి లాక్కుపోయిన వాళ్ళు పోగా, ఇంటిమీదకొచ్చి అరిచేవాళ్లు అందినంత అందుకోగా, అట్టర్‌ప్లాపయిన పిక్చర్ తీసి తల పట్టుకున్న నిర్మాతలా అయిపోతాడతడు ప్రతినెలా మొదట్రోజున.

మళ్ళీనెల వచ్చేవరకు పైసాకోసం లంకణాలే! లచ్చినాణకి ఎవడూ అప్పుపెట్టడు తెలిస్తెలిసి. తెలీక ఎవడైనా ఎప్పుడైనా ఎర్రవీగాణి అప్పుపెట్టినా, అది తిరిగిరాదని, దానధర్మాల లిస్టులోకి చేరిపోవలసిందేనని ఆఫీసు నోటీసు బోర్డులో కూడా అంటించేశారెవరో. అంచేత ఆఫీసుకొచ్చిన కొత్తవాడు కూడా లచ్చినాణ సంగతి మొదట్రోజే తెలిసేసుకొని, పొరపాట్న కూడా అప్పు ఇవ్వకూడదని నిర్ణయించేసుకోవాలని దాని సారాంశం.

వచ్చినాణ అప్పుడే జీతం అందుకున్నాడు. అప్పుడు మధ్యాహ్నం సరిగ్గా మూడుగంటలు. కటింగులు పోగా కరెక్టుగా మూడు పెద్ద నోట్లు చేతికందేయి. వాటిని మూడుసార్లు ముచ్చటగా ముద్దు పెట్టుకుని జేబులో పెట్టుకున్నాడతడు

ఆ సమయంలో లచ్చినాణ ముఖం వెయ్యి వోల్టుల వెల్క్ట్రీబల్బులాగ వెలిగిపోతోంది. అయితే ఆ కాంతి ఎంతోసేపు వుండదని అతని లోపలి మనిషి హేళనగ గుర్తు చెయ్యగానే అది కాస్తా సీరియస్‌గా మారిపోయింది.

లచ్చినాణ అసలు పేరు లక్ష్మీనారాయణ. అది లోకుల కాకుల నోళ్ళలోపడి లచ్చినాణ అయిపోయిందన్నమాట!

లచ్చినాణకి ఆ పేరు పెట్టడంలో వాళ్ళఫాదర్ చాలా ఆలోచించేడు. బోల్డన్ని కలల్ని రంగరించి నామకరణం జరిపించేడు.

దేశంలో శాంతి భద్రతలు కాపాడ్డమే తమ లక్ష్యమన్న ఆశాభావాన్ని వ్యక్తంచేసే హోంమినిస్టర్లాగా— భవిష్యత్‌లో డబ్బు సంపాదించేసి, ఎదురింటి మార్వాడీ మేడని మించిపోయేలా దాని జేజేమ్మలా ఓ ఆరేడు అంతస్తుల బిల్డింగు కట్టించేస్తాడనే ఆశా భావాన్ని వ్యక్తం చేస్తూ లచ్చినాణ ఫాదర్ ఆ పేరు పెట్టేడు.

అప్పట్నుంచీ కొడుకు బిల్డింగు ఎప్పటిక్కడతాడా అని ఎదురుచూస్తూనే బొందిలో ప్రాణం ఎగిరిపోతున్నా యములాళ్లతో పోరాడి, రెండుసార్లు చావు తప్పించుకుని, తన చిరకాలపు చిరుకోరిక త్వరలో ఈడేరుతుంది – అనుకుంటూనే ఎనభై రెండేళ్లు బతికేడు.

"దిక్కుమాలిన తొత్తుకొడుకు! ముసిలి ప్రాణం మహా గట్టిగావుంది. ఎప్పటికీ చావురాదేం వీడికి?" అని రోజూ తిట్టుకుంటూనే ఎప్పుడా 'ముసిలి ముండాకొడుకు' మీద కెళ్తాడా అని రోజులు లెక్కెడుతూ ఎదురుచూసేవాడు లచ్చినాణ.

లచ్చినాణగా స్థిరపడ్డాక తన అసలు పేరు మర్చిపోయేడతడు. అలా మర్చిపోవడమే మనశ్శాంతి కొంత హేతువవుతుందని ఆశపడ్డాడు కాని, అదెలావుంటుందో ఇంతవరకూ బోధపళ్లేదతడికి.

లచ్చినాణ జీతం అందుకున్న ప్రతిసారీ ఆఫీసు క్యాంటీన్లో బ్రూ కాఫీ తాగుతాడు – అదీ చక్కెర ఎక్కువ వేయించుకొని.

తన బ్రతుక్కి నెలకో రోజువచ్చే ఆ స్వీట్‌డే (డబుల్ సుగర్ కాఫీ తాగే తత్ దినం) కోసం ఇరవైతొమ్మిదిరోజుల విరహాన్ని అనుభవిస్తాడతడు.

ఎప్పటిలాగే ఆ రోజు కూడా ఆఫీసు క్యాంటీన్లోకి అడుగుపెట్టాడతడు.

వాడు ప్రతి జీతాల్రోజునా రెండో మూడో స్వీట్స్ చేస్తాడు. క్యాంటీనులో అప్పటికే చాలా

శాల్తీలు క్రిక్కిరిసిపోయి స్వీట్‌మీద విరుచుకు పడ్డాయి.

వీళ్ళందరికీ బాదర బందీల్లేవా ?

కష్టాలూ కన్నీళ్ళూ లేవా ?

తిప్పలూ సొప్పలూ లేవా ?

లేక వుండీ కూడా వీళ్ళు అవేం పట్టించుకోకుండా చిదానందంగా చిద్విలాసంగా శుబ్బరంగా స్వీట్స్ మెక్కుతున్నారా ఇక్కడ ... !

తాను వాళ్ళలా ఎందుకుండలేకపోతున్నాడు ?

తనకీ వాళ్ళకీ ఎందులో తేడా? స్టేటస్‌లోనా? జీతంలోనా ? కష్టసుఖాల్లోనా ?

అవేం కాదే ! తనకంటే వాళ్ళకే ఎక్కువ కష్టాలున్నట్లు చెప్పుకుంటారు వాళ్ళే !

వాళ్ల నోటితో వాళ్ళే అన్నారే ! జీతంలో కూడా తేడా లేదే ! మరి ఎలా వుండగల్గుతున్నారు?

లచ్చినాణని చూడగానే క్యాంటీన్‌వాడు ముఖం ముడిచేసుకున్నాడు. తన్ని చూడగానే వాడెందుకలాగ అయిపోయేడు ?

అయిపోయేడంటే — అయిపోడూ మరి ?

తాను నెల్లో ఎన్నిరోజులు వాడి దర్శనం చేసుకుంటాడు కనుక ?

ఒకే ఒక్కరోజు... అదీ జీతాలొచ్చిన రోజున మాత్రమే !

తనవల్ల వాడి కొచ్చేదెంత ? ఒరిగేదెంత ? మహా అయితే తన కాఫీ బేరంవల్ల వాడికి ఓ పావల్డబ్బులు కిడతాయేమో !

బహుశా అవీ కిట్టకపోవచ్చు ! తనకి డబుల్ సుగర్ కావాలి.

సుగర్ అంటే గుర్తొచ్చింది. చక్కెర రేటు మక్కల్లో విహరిస్తోంది.

బ్లాకులో పది రూపాయలు పోసినా కిలో సుగర్ రాలడంలేదు.

అన్నట్టు 'పెళ్లాంముండ' నిన్ననే నోటీసిచ్చింది. 'ఏఁవండోయ్ ! రేపు జీతఁవందగానే ఎలాగైనా చేసి, ఓ అర్థకిలో చక్కెరయినా తీసుకురాకపోతే టీ నీళ్ళు కాదుగదా నీళ్ల టీ కూడా దొరకద'ని ఆర్డరేస్సి మరీ చెప్పింది.

దానికేంపోయింది ! భడవా ముండకి తన బాధలేం తెల్సునని ?

సుగర్ పుట్టడఁవంటే మాటలా ?

లచ్చినాణని చూడగానే మొహం తిప్పేసిన క్యాంటీన్ మేనేజరు ఏం సైగ చేసేడోకాని, అడక్కుండానే 'కాఫీ లేద్సార్' అని చెప్పేసేడు పనివాడు.

తనకి లేని కాఫీ వరదరాజెలా తాగుతున్నాడు ?

వాసుదేవరావెలా తాగుతున్నాడు ?

వర్ధనరావెలా తాగుతున్నాడు ?...

అసలు వాళ్లందరికీ చిర్నవ్వుతో సప్లై చేసే ఆ బోడి మేనేజరీ ముండాకొడుక్కి (వాడికి బట్టతల ఉందిలెండి) తనని చూస్తే ఎందుకంత పగ ?

అస్సలు వీళ్లందరూ... అంటే — వరదరాజూ వగైరాలు అదోలా చూస్తారేం ?

వెనక చేరి అవాకులూ—చవాకులూ పేల్తారేం?

గుసగుసలాడుకుంటారేం ?

అప్పుడెప్పుడో వర్ధనరావు తన్ని '(వాపి మొహంగాడొస్తున్నాడు' అని కనకరాజుతో చెప్పి గట్టిగా నవ్వినట్టు గుర్తు...

అన్నట్టు కనకరాజేడీ ? ఏఁవయ్యేడు ?

వాడు... ప్యూన్‌గాడు... వాడికెంత గౌరవం? ఎంత మర్యాద ?

ఆఫ్టాల్ ఆఫీసు ఊడ్చే వెధవ రోజూ క్యాంటీన్ బిల్లు రెండ్రూపాయలకి తక్కువ లేకుండ కట్టడమా ? వాడు తన కేడర్‌లోని సాటి ఉద్యోగస్తులతో కలిసి కాఫీ టిఫన్లు సేవించడమా ? వాడికి వీళ్లంతా ఏదో పేద్ద ఆఫీసరు కిచ్చినట్టు తమమధ్య చోటిచ్చి, తమ కాఫీలో షేరిచ్చి మర్యాజ్జెయ్యడమా ?

'రాయినైనా కాకపోతిని' స్టయిల్లో ఏదో పాట ఉన్నట్టు గుర్తు.

'ప్యూన్‌నైనా కాకపోతిని' అని మనసులోనే ట్యూన్ చేసుకుని, అంతలోనే 'ఛ ! ఛ ! ప్యూన్‌నైనా బాధే. మరీ చచ్చేవాడ్ని. ఇప్పటికి గుఁవస్తాగా మూడొందలందుకుంటేనే మూపటేళకి మనీపర్సు ఖాళీ అయిపోతుంటే... రెండొందల్తో నేను సాగ్గలనా ? సంసారఁ ఈదగల్నా ?

మరి వాడెలా ఈదుతున్నాడు ?

వాడికి సంసారం వుంటేగా ! ఒంటిపిల్లి రాకాసి వెధవ వాడు. ఏకాకిగాడు. వాడు వెలిగించకపోతే ఇంకెవరు వెలిగిస్తారు దర్జా ?

వాడు ఖర్చు పెట్టేనట్లు ఇంకెవడు ఖర్చు పెట్టగలడు ?

వాడు కాల్చినట్లు కాస్ట్లీ సిగరెట్లు ఇంకెవడు కాల్చగలడు ?

వాడు తొడిగినట్లు ఖరీదైన బట్టలు మరొకడు తొడగ్గలడా ?

ఈవెన్... ఆఫీసరుడైనా ఇవేవీ చెయ్యలేడు.

చెయ్యలేడు గాక చెయ్యలేడు.

అంచేత వాడికి వెయిటుంది. తనకి లేదు.

వాడితో తిరిగేవాడికి అప్పు పుడుతుంది. తన్తో తిరిగేవాడికి అప్పు కూడా పుట్టదు. పైగా తాను వాణ్ణి అప్పు అడక్కపోతే చాలు !

అవును ! కనకరాజు ఆఫీసులో అందరికీ అప్పు లిస్తాడు. ఇవ్వగలడు. కనుకనే అంతా వాడిచుట్టూ చేరతారు.

వాడికి కాఫీ లిప్పిస్తారు. కాకా పడతారు. మస్కా కొడతారు. అవసరమయితే నమస్కారా లెడతారు.

పదో — పాతికో చే బదు ళ్లు చేస్తారు. వెధవలు... కావాలంటే — వాడు చెప్పిన పన్లుకూడా చేస్తారు.

వాడికి ఫ్యాన్సులు వీళ్ళు. తనకా పని చేతగాదు. అందుకే తనంటే అందరికీ ఎలర్జీ. తనకు మిగిలిన వాళ్లంతా ఎగస్పార్టీ.

ఆ ఘనత వహించిన కనకరాజుగారెక్కడ ?

అదుగో ! అక్కడున్నాడు.

అరె ! ఇటే వస్తున్నాడేం ?

తనవైపు కాదు కద ! తానెప్పుడూ వాడ్ని అప్పడగలేదే ! అడిగినా వాడివ్వడన్తెల్సు తనకి.

వాడి చేతిలో ఆ స్వీట్సన్నీ ఏమిటి ? కొంపతీసి అవన్నీ వాడే తినడు కద !

తిన్నా తింటాడు... వాడికేం ?

వెధవ ! తింటే ఛస్తాడు... అన్నీ తింటే అతిసార రోగం పట్టుకొని సరాసరి పైకెళ్లిపోతాడు.

పోవాలి ! వాడు చావాలి.

ఎందుకిలా కోరుకుంటున్నాడు తాను ?

లేదు. వాడు ఆ స్వీట్లన్నీ తివ్వానిక్కాదు తెస్తున్నది.

అందరికీ పంచుతున్నాడేం ? ఇంతకీ ఏమిటి అకేషన్ ? వాట్స్ ది రీజన్ ?

అరె ! అందరికీ ఇచ్చి తనకు యివ్వడేం ?

తనేం పాపం చేశాడు ? తాను వాడికేం ద్రోహం చేశాడు ?

అసలు తనని గమనించేడా లేదా ? లేక గమనించనట్లూరుకున్నాడా ?

తానేమన్నా నల్లపూసా ? పచ్చపూసా ! కనిపించకపోవడానికి...

మరి వెధవ తనని గుర్తించలేదేం ?

పోనీ ! తనకేం నష్టంలేదు... వాడిచ్చే అర్ధరూపాయి స్వీట్ కోసం తనేం చచ్చిపోవడంలేదు.

(క్యాంటీన్లలో స్వీట్ల సైజూ — బరువూ

# మినీ సౌదామినీలు

డా॥ పి. నారాయణరెడ్డి

**1**

కుర్రాళ్లొస్తున్నారు చూడండి
కొత్త గొంతుల్ని యెగరేసుకుంటూ.
పరమ వృద్ధులూ తప్పుకోండి
పాత కీర్తిని నెమరేసుకుంటూ.

**2**

పువ్వు పడుకుంది తీగ కవుగిట్లో
పొగ పడుకుంది బూది కుంపట్లో.
పువ్వు పలికితే పరిమళభాష
పొగ రగిలితే అగ్నిఘోష.

**3**

ఎదిగినకొద్దీ సగటుమనిషి
ఏమవుతాడు ? ఇంకేమవుతాడు ?
తనలోని శిశువును పాతిపెడతాడు
అణగారిన సైతాను వెన్నుతడతాడు.

**4**

దేశాలన్నీ పిచ్చెత్తి దెబ్బలాడుకుని
సరిహద్దుల గుండీలు తెంపేసుకుని
జాతీయత చొక్కాలు చింపేసుకుని
అలిసిపోయి నా ముంగిట్లో వాలితే
అదే విశ్వకుటుంబం.

రంగూ — రుచీ — వాసనా అర్థరూపాయికి తగ్గట్టు గానే వుండును.)

'హాపీ బర్త్‌డే టూ యూ' అంటూ అందరూ వాడికి గ్రీటింగ్స్ చెప్తున్నారేం ?

వాడి మొహం! వాడికి హాపీ బర్త్‌డే కూడానా?

అదా సంగతి ! జీతం వచ్చినప్పుడల్లా వాడి పుట్టినరోజు వస్తుంటుందా ?

వస్తుందొస్తుందొస్తుంది ! రాక ఛస్తుందా ?

కాఫీ లేదని తెలీగానే ఇక అక్కడ ఉండడం అనవసరం అనుకున్నాడు లచ్చినాణ. అనుకోవడమే తడువు — నెమ్మదిగాడు కూడానూ.

'చూడవోయ్ కామేశం ! లచ్చినాణ మొహం ఎలా మాడిపోయిందో చూశానా ! ఎదురుగావున్న పిల్లకోడిని డేగ రివ్వున వొచ్చి తన్నుకుపోయినపుడు కింద నిలబడి ఏమీ చెయ్యలేక అసహాయంగా చూస్తూ నోర్మూసుకున్న పహిల్వాన్‌లాగ అయిపోయేడు చూసేనా ?''

ఆ మాటలు ఏ గాడిద రాస్కెల్ అంటున్నాడో తనకి బాగా తెలుసు !

ఇంకెవడు ? ఆ బాకాగాడే ! వరదరాజుగాడే ఒడిపోసుకుంటున్నాడు.

అనుకోనీ ! వాళ్లిష్టం వొచ్చినట్లనుకోనీ !

వంద ! ... వెయ్యి !! ... లక్ష !!! ... అనుకోనీ ! తనకేం ?

తాను ఆ కుక్కల జాతిలో లేదు. అంచేత తాను అధికుడే. వాళ్లందరి కంటె బెటరే ! ఉత్త బెటరేమిటి ? ఫార్ బెటర్.

సెల్ఫ్ శాటిస్‌ఫాక్షన్ కలిగాక, ఫేంటుజేబులో చేతులుంచుకుని నెమ్మదిగా లాన్‌వైపు నడిచాడు.

టీ బ్రేక్‌లో, ఆ పావుగంటలోనూ ఇంకా మూడునిమిషాలు మిగిలుంది.

'అబ్బా ! కాల్లో ముల్లు గుచ్చుకుంది'—అని బయటికే అని చెప్పు చేతిలోకి తీసుకొని దాని సుందాన్ని పరిశీలించాడు.

సర్వీస్ చేస్సేసి రెస్టు తీసుకోవాల్సిన స్టేజిలో వుందది.

పావు అంగుళం కంటె ఎక్కువ దళసరిగా లేదు. అప్పటికే అకులా వ్రేళ్లాడిపోతోంది. ముల్లు అందులోంచి దూసుకొచ్చి గుచ్చుకున్నాదంటే గుచ్చుకోదా ?

అసలా చెప్పు ఎప్పటిది ? నిన్నటిదా ? మొన్నటిదా ? గత సంవత్సరం ప్రారంభంలో కొన్నాడు దాన్ని.

మోస్ట్ ఒబిడియంట్ సర్వెంట్‌లా తనకి సుమారు సంవత్సరంపావు కాలం సేవజేసిందది.

రిటైర్ కావడానికి తయారైంది. ఇంకెంత కాలం వస్తుంది. వెధవది. మనిషి జీవితమే శాశ్వతం కాదు. మనిషిచేత సృష్టించబడ్డవాటికి మాత్రం శాశ్వతం ఎక్కడ్నుంచి వొస్తుంది ?

తన వేదాంత పరిజ్ఞానానికి నవ్వొచ్చింది లచ్చినాణకి.

ఏదేమైనా అది ఈ సాయంత్రం వరకూ ఆగితే బావుణ్ను !

ఆగకేం చేస్తుంది ? తన్లాటి మిడిల్‌క్లాస్

# తెగిన చెప్పు

ఫ్యామిలీవాణ్ణి వరించినందుకు వచ్చినట్టు పడివుంటుంది.

కాలికింద చెప్పులా అణిగిమణిగి వుంటుంది.

ఓహో ! అన్నట్లు అది చెప్పే కదూ ! ఉండి తీరుతుంది.

ఏమో ! ఎవడు చెప్పగల్డు ?

దానికి కాలం చెల్లితే, తన ఖర్మ కాలితే సాయంత్రంవాకా ఎందుకు ? అది ఇప్పుడే మొండి కేసినా వేస్తుంది.

పోనీ ! సాయంత్రందాకా ఉంటే మాత్రం తాను కొత్త జత కొనగల్డా ?

బడ్జెట్ కాయితం జేబులో బరువుగా మూల్గింది.

ఓసారి తీసి చదూకున్నాడు.

కందిపప్పు కేజీ, పెసర, మినప, శెనగ వగైరా పప్పులన్నీ వరుసగా ఒక్కొక్క కేజీ మాత్రమే. నూనె, ఆవాలు, చింతపండు, మిరపకాయలు, ఇంగువ, సింగినాదం, జీలకర్ర, గాడిదగుడ్డు–వినుక్కున్నాడు.

విసురుగా దాన్ని వుండ చుట్టి గిరాటేశాడు.

మళ్లీ అంతలోనే ఆ లిస్టు నిత్యావసర వస్తువుల సూచిక అని గుర్తొచ్చి పారేసిన దానికోసం వెతికాడు. అది ముళ్లకంచెల్లో పడింది వెళ్లి.

ఒడుపుగా ఒక వంకీ కర్రతో దాన్ని బయటికి లాగాడు.

పరిస్థితులకి ఎలిగిపోయి, ముప్ఫయ్యేళ్లకే మీదపడ్డ వార్థక్యపు ముడతల్లా మడతలు పడింది అది — తన కసికి ప్రతీకగా.

దాన్ని అరచేతులమధ్య సాపుజేసి, మళ్లీ జేబులో పెట్టుకున్నాడతడు.

టీ బ్రేక్ అయిపోయినట్టుంది. అందరూ సీట్లమీద కునికిబాట్లు పడ్డానికి బయల్దేరుతున్నారు. కొందరి చేతుల్లో తగలడుతున్న సిగరెట్లు పొగలు క్రక్కుతూ వాళ్ల ఆనందంలాగే రింగులు తిరుగుతున్నాయి.

తనకి మాత్రం అవి పరిస్థితుల వలయాల్లా కన్పిస్తున్నాయ్.

సిగరెట్ కాల్చాలనిపించింది లచ్చినాణకి.

జేబులో డబ్బుల్లోంచి ఓ వంద రూపాయల నోటు, వెధవది సిగరెట్టు తగలేయడం కోసం మార్చాలనిపించలేదు.

తన కెవడైనా సిగరెట్ ఎరవిస్తే బావుణ్ను!... ఎరవు సొమ్ము బరువుచేటుట.

పోనీ ! అప్పుగా ఇచ్చినాసరే !

నో ! ఎవడూ ఇవ్వడు. కాళ్లీడ్చుకుంటూ వెళ్లి తన సీట్లో కూలబడ్డాడతడు.

ఫైళ్లు ఆఫీసు కంపు కొడుతున్నాయ్

కాదు — ఆఫీసే ఫైళ్ల కంపు కొడుతోంది.

లేక... రెండూ వాసన వేస్తున్నాయో...

అంతా గజిబిజిగా వుంది — తన బుర్రలో ఆలోచనల్లాగే !

సీట్లో వెనక్కి జారపడ్డాడు...

తన సీటు కెదురుగా వున్న గోడ గడియారం నాలుగ్గంటలు సూచిస్తోంది.

ఇంకా ఆఫీసులోంచి బయటపడ్డానికి గంటన్నర వుందన్నమాట !

అందరూ ఫైళ్లు సర్దేసి కులాసాగా కబుర్లు చెప్పుకుంటున్నారు.

వాళ్లెప్పుడూ అంతే ! జీతాలొచ్చిరోజు నయితే మరి చెప్పక్కర్లేదు.

ఎవడూ కాగితంమీద కలం మోపడు...

అందరూ తనమీదే జోకులేసుకుంటున్నట్టున్నారు.

తనతో ఎవడూ మాట్లాడ్డు. తానెవళ్లతోనూ తిరగడు...

వాళంతా పెద్దగా నవ్వుకుంటున్నారు — తనమీదేసిన జోక్ పేలినట్లుంది.

తాను వాళ్లలా నవ్వలేడు. తనలావాళ్లు ఏడవలేరు. బాధపడలేరు.

అదివాళ్లకు చేతకాదు. తనకిది చేతగాదు ...

అది వాళ్లకి వరమో, తనకిది శాపమో తెలీదు...

కాలం ఘనీభవించిపోయింది. గడియారం ముళ్లు గర్భిణీ స్త్రీలా మెల్లగా కదులుతున్నాయ్ ...

కనకరాజు ఈలవేసుకుంటూ, ఏదో హిందీ పాటని హమ్మింగ్ చేసుకుంటూ హుషారుగా వచ్చేస్తున్నాడు లోపలికి.

నిజానికి వాడిది రాజాలాంటి జీవితమే !

కనక వాడు కనకరాజయ్యేడు.

వాడికాపేరు పెట్టినందుకు వాళ్ల నాన్నని అభినందించాలి.

వాడేగాని కుమకురాజైతే ... ?

వాళ్ల నాన్న ఏమనుకొనేవాడు ? అసలేమన్నా అనుకొనేవాడా ? ...

తన తండ్రిలాగే వాడి తండ్రి పేరు పెట్టడంలో స్వార్థాన్ని యిమిడ్చి ఆ పేరు పెట్టి ఉంటాడా ?

నో ! ... అలా అనుకొని వుండడు...

ఎందుకుండడూ ? ఏ తండ్రికి మాత్రం తన కొడుకు గొప్పవాడు కావాలని ఉండదు ?

ఉంటుంది ... తప్పకుండా వుంటుంది ...

కాని అంచక్కని ఐడియా, ఆ ఫ్యూన్‌గాడి తండ్రికెక్కలిగివుంటుందా ? కలిగే వాడికాపేరు పెట్టాడా ?

ఏమో ! వాళ్లనాన్న ఏం అనుకొని పెట్టేడో గాని, వాడు తన పేరు సార్థకం చేసుకున్నాడు.

తనకూ వుంది చక్కనిపేరు - లక్ష్మీనారాయణ అని ... కాని తన్ని సిరి వరించిందా ?

అయినా, ఫ్యూన్‌గాడితో పోల్చుకోడమేమిటి ? నాన్సెన్స్ ... తానెక్కడ ? వాడెక్కడ ? వాడు వాడే! తాను తానే ! ...

తనకి సీటు వేల్యూ అయినా వుంది. వాడి కదిలేదు ...

లేదని ఎవడన్నాడు ? ఆ మాటకొస్తే తన కంటే వాడి సీటుకే వేల్యూ ఎక్కువ.

ఏ కాయితమన్నా కదలాలంటే స్టాంపు ముద్దరేయాలి.

ఆ పని వాడే చేయాలి. అర్జెంటయాలంటే వాడి చెయ్యి తడి చెయ్యాలి.

కొందరయితే 'బాబ్బాబు, నాయిన్నాయినా' అని బతిమాలి, బర్కిలీ సిగరెట్టిచ్చి, బయటకి

తీసెళ్ళి కిళ్ళీ కట్టించి, బొడ్లో పదో పాతికో దోపి బయట పడుతుంటాడు ...

ఇంతాజేస్తే రాజుగారి తరపున రాజముద్రవేసే సేవకుడిలాగ ఆఫీసరు తరపున ఆయన సంతకం కింద ఆయన డిజిగ్నేషన్ స్టాంపు వేస్తాడువాడు.

ఇప్పుడాలోచిస్తే ఎవడు అధికుడు ? ...

నెల మొత్తమ్మీద పైగప్పీలు పదివందలదాకా కళ్లజూసే కనకరాజు అప్పులిచ్చి ఆదుకోకపోతే ఆఫీసు జవాన్ని లచ్చినాణలాంటి దేవ్వదేవి ద్వైవృత్రులు ఆదుకుంటారా ? ...

కాకాలూ బాకాలూ వాడిక్కాకపోతే తనకు పడతారా ?

ఈ రోజేమిటో ఆలోచమ్ము ఓవర్ డోసై పోయేయి.

డోసెక్కువైతే బ్రెయిన్ డబుల్ పోద్ది ...

కట్టెయ్యాలి... ఆలోచనల్ని కట్టకట్టి విసిరెయ్యాలి...

మళ్లీ గడియారంకేసి చూశాడు...

దిక్కుమాలిన కాలం దిక్కు దిక్కు మని బక్కవాళ్లాగ నడుస్తుందేం ?

టకటకా అరిస్టోక్రాట్ పర్సనాలిటీ వున్న వాళ్లాగ నడవక...

అయినా దాంతో పనేమిటన్నట్టు కొందరు




MCA PDC/62/Tel R

కబుర్లు చెప్పుకొని కష్టపడిపోయినవాళ్లు అప్పటికే సీట్లలోంచి లేచారు.

కొందరు ఆఫీసు బాత్రూంల నాశ్రయించారు.

ఇంకొందరు నిద్రాదేవిని ఆహ్వానించి కలల కౌగిల్లో కరిగిపోతున్నారు.

లచ్చినాణ అవేమీ చెయ్యకపోయినా సీట్లోంచి లేచాడు

బయటకొచ్చి వరండాలో నిల్చున్నాడు.

రెండు మూడు గుంపులు లాన్‌లో హుషారుగా రాజకీయ రామాయణం పారాయణ చేస్తున్నాయ్.

ముబ్బులు పట్టేసినప్పుడు అక్కడక్కడ కన్పించే చుక్కల్లా కొందరు ఒక్కొక్కచోట ఒక్కొక్కరు రకరకాల విన్యాసాల్లో వివిధ భంగిమల్లో ఇంతవరకు ఆఫీసులో పడిపోయిన కష్టానికి రిలీఫ్ ఫీలవుతున్నారు.

టోటల్‌గా అందరి వదనాలూ ప్రసన్నంగానే వున్నాయ్

ఇక ఆ సాయంత్రం ఆఫీసులోపల ఉండాల్సిన అవసరం ఎవరికీ లేదన్నట్లు ప్రవర్తిస్తున్నారు.

లచ్చినాణకీ అటువంటి అభిప్రాయమే కలిగింది.

అది తనకి సొంతంగా కలిగిన అభిప్రాయం కాదు.

మిగిలిన వాళ్లందర్నీ చూసి అలా అనుకున్నాడతడు...

అలా అనుకున్న తక్షణం దాన్ని ఆచరణలో పెట్టాడు.

రెండు నిముషాల్లో ఆఫీసు కొద్దికొద్దిగా కనుమరుగైంది.

ఏడు రోడ్ల జంక్షన్ వచ్చింది.

# తెగిన చెప్పు

రాజా సిల్క్ పేలెస్‌మీదా, ఉడిపి హోటల్ మీదా రంగు బల్బులు వెలుగుతూ ఆరుతూ, సుస్వాగతం బోర్డులో ఇరుక్కొని మావైపు కాస్త చూడండని మిలమిలలాడుతూ పిలుస్తున్నాయ్.

వాళ్లకూ తెల్సు — ఈ రోజు ఫస్టు తారీఖని. ఉద్యోగస్థులూ—వాళ్ల జేబులూ కళకళలాడతాయనీ

అందుకే ఆ డెకరేషనూ, ఎట్రాక్షనూ, ఆరాటమూ, ఆర్భాటమూ అంతానూ.

విజయనగరం రోడ్‌వైపు నుంచి శ్రీకాకుళం వస్తున్న బస్, స్టాండువైపు మలుపు తిరుగుతోంది

నలుగురు రిక్షావాళ్లు బీడీదమ్ము కొట్టుకుంటూ ప్యాసింజర్ సీట్లో సవిలాసంగా పడుకొని, తొక్కే సీటుమీద కత్తెర మార్కులో కాళ్లు పెట్టుకొని, అరమోడ్పు కళ్లతో పట్నం సాయంత్రాన్ని వీక్షిస్తున్నారు

'సూర్య మహల్లో సినిమా అందుతుందో అందదో ?... మురళికి పోదాం రా' అని పరుగులు తీస్తున్న వాళ్లు కొందరు.

'ఆంజనేయస్వామి గుళ్లో రాత్రి హరికథ వుందిట' వెంకటేశ్వరస్వామి గుడినుంచి వస్తున్న బోడెమ్మల గుంపొకటి పెద్దగా చర్చించుకుంటూ రోడ్డువారగా నడుస్తోంది.

కూరల సంచీ ప్రైవేటు కుర్రాడి చేతికిచ్చి పొగాక్కొట్లో దూరి బేరాలాడుతున్నారో చిన్న బడి హెడ్మాష్టారు.

కంసాలి దుకాణం దగ్గర 'అరతులం బంగారప్పినర్లో ఆరణాలెత్తు రాగి కలిపి అంట గట్టేస్తావా ? నీ కిది నేయుఁవేనా ?' అని తగూకి దిగిందో ఇల్లాలు.


నాలుగు చక్రాల స్వీట్‌బండీ దగ్గర నిలబడి, 'కోపల అద్దాల మధ్య రుచులూరిస్తున్న పదార్థాల వంక చొంగ కార్చుకుంటూ నిలబడ్డారిద్దరు నగటు ఫామిలీ కుర్రాళ్లు.

అలవోకగా ఒకే ఒక రఫ్ నోట్‌బుక్ తప్ప ఇంకేం పట్టుకున్నా తప్పయిపోతుందన్నట్లు చేతు లూపుకుంటూ నడుస్తున్న హైస్కూలు కుర్రాళ్ల మంద మధ్యన ఇన్‌షర్ట్ చేసిన గిరజాల జుట్టు కుర్రాడొకడు ఇటీవల తాను చూసిన హిందీ సినిమాలో అమితాబ్‌బచ్చన్‌కీ, శత్రుఘ్నసిన్హాకీ జరిగిన వార్‌ని, డిక్లేర్‌ డిక్టేట్ చేస్తున్నాడు.

స్టెప్స్ ప్రాక్టీస్ చేస్తున్నట్లు నడుస్తున్న ఇంజనీరింగ్ కాలేజీ వాళ్ల వాలకం చూస్తే, వాళ్లు ఇళ్లకో మరెక్కడికో బోధపడడం లేదు.

చంకని సాపాయినో బిందెనో వేసుకోవాల్సిన అవసరం ముమ్ముందు కలుగుతుంది కాబట్టి, దాని కిప్పట్నుంచే ప్రాక్టీసు ప్రారంభిస్తే మంచిదని భావించిన అమ్మాయిలు పుస్తకాల్ని ఆ ఫక్కీలో ఎత్తుకుని హిందీ మేడమ్ వేసుకొచ్చిన కొత్తరకం రింగుల గురించీ, ఇంగ్లీషు లెక్చరర్ వేసుకొచ్చిన షిఫాన్ చీర గురించీ ముచ్చటించుకుంటున్నారు.

పరీక్షపోయి ట్యుటోరియల్ కాలేజీల ద్వారా నెక్స్ట్ సెప్టెంబర్‌కో మళ్లీ మార్చికో ప్రిపేరౌతున్న



కొందరు కుర్రాళ్ళు ఆడగాలి కోసం సెంటర్లోకి చేరుకుంటున్నారు.

నాగావళీనది కొళాయిల ద్వారా సప్లయ్ చేస్తున్న నీళ్ళు చాలని కొన్ని ఉమ్మడి (తడీ-మడీ వున్న) కుటుంబాలవాళ్ళు నీళ్ళ స్టోరేజీ కోసం నానా యాతనా పడుతూ పరుగెడుతున్నారు బిందెలెత్తి.

పాడుబడిపోయిన పార్కుల్లోకెళ్ళి పాములూ - పురుగుల వాతబడి చావడమెందుకని బతుకుమీద ఆశచావని వయసు మళ్ళినవాళ్ళు కొందరు పాపం - పిల్లగాలికోసమో, పిల్లతో సహా వీచే చల్లగాలి కోసమో పంచె ఎగ్గట్టుకొని మరీ నడుస్తున్నారు.

ఇన్ని లైఫ్ స్కెచెస్‌నీ తీరిగ్గా చూసుకుంటూ, ఆ వేళ జేబుల్లో డబ్బులు దండిగా ఆడుతున్న గుమాస్తాన్ రావులు, పూలకొట్లు కన్పించగానే పెళ్ళాం గుర్తుకొచ్చి 'పోన్లేపాపం! నెలకోరోజు గదా! కొసరి-కొసరి సరసమాడ' పని కొస్తాయని ముందు జాగ్రత్త పడుతున్నారు.

లచ్చినాణకీ తన పెళ్ళాం గుర్తొచ్చింది.

ఇంట్లో ఆ యిందిరాస్కెల్ ఏం చేస్తుంటుందీ పాటికి ...

ఏం చేస్తుందేవిటి ? తన కోసం ఎదురు చూస్తూంటుంది. తనకొచ్చే ముష్టి మూడొందల కోసం వెయిట్ చేస్తుంటుంది.

దానిపేరు ఇందిర. తాను తగిలించి ముద్దుగా పిల్చుకొనే రాస్కెల్ పదంలో కూడా ఒక అక్షరాన్ని పొదుపు చేసేశాడు.

పొదుపు ! పొదుపు !! పొదుపు !!!

ఏదీ ఎక్కడుంది ?

ఎక్కడున్నా లేకపోయినా **జాతీయ** పొదుపు ఉద్యమ సంస్థ బోర్డులో వుంది.

తలొంచుకుని నడుస్తున్న లచ్చినాణ తలెత్తి చూశాడు.

కొంచెం దూరంలో నేషనల్ సేవింగ్స్ వాళ్ళ బోర్డుమీద పట్టులోకి తేనె చేరవేస్తున్న తేనెటీగ ఒకటి క్లోజప్‌లో కన్పించింది.

దాన్ని చూడగానే ఇంట్లోకి తేవాల్సిన సరుకులు గుర్తొచ్చేయి.

ఇందిరాస్కెల్ ఇచ్చిన కాగితాన్ని బైటికి తీశాడు.

గత నెల్లో కనిపించని పదార్థాలు ఈ నెల్లో కొన్ని చోటు చేసుకున్నాయి.

ఏమిటబ్బా అవి...? అమూల్ పాలడబ్బా ఒకటి, పారాచూట్ బ్రాండ్ కొబ్బరినూనె సీసా ఒకటి, షికాకాయ్ సబ్బొకటి.

డామిట్ ! దీనికి మరీ బుద్ధిలేకుండా పోతోంది.

కంపెనీ పేర్లతోసహా రాసిచ్చింది-వివిధ్భారతిలో వచ్చే అడ్వర్టయిజ్‌మెంట్ల ప్రభావమో ఏమో...

పొదుపు చేయండి బోర్డు ప్రక్కనే 'ఇద్దరు లేక ముగ్గురు చాలు -- పిల్లల మధ్య అంతరానికి డాష్ డాష్ డాష్... వాడండి.'

కుటుంబ నియంత్రణవారి బోర్డుమీద చిరునవ్వుల చిన్నారి పాపలు తండ్రి రెక్కపట్టుకొని ఒకళ్ళూ, తల్లి చెయ్యి పట్టుకొని ఒకళ్ళూ సరదాగా అడుగులేస్తున్నారు. దానికింద 'పావలాకు మూడు- అన్నిచోట్లా దొరికే' ప్యాకెట్ సిద్ధంగా వుంది. అవును ! నిరోధించాలి.

తనబోటి మిడిల్ క్లాసు ఫామిలీగాళ్ళు తప్పకుండా పాటించాల్సిందే !

కాని అదేవిటో... ఆ మూడు క్షణాలూ, కాంతామణి కౌగిట్లో కలిసిపోయినప్పుడు, కాలం ఆగిపోయినప్పుడు ఈ నియంత్రణలూ, నిరోధ్‌లూ గుర్తుకు రావు.

దానికి ఫలితంగా - మరో బిడ్డకు బర్త్...

అందుకు ప్రతిఫలంగా - కొన్ని సుఖాలు డెత్...

జీవన్మరణ సమస్య అంటే - ఇదే ! ఇదే !! ఇదే !!!

చేతిలో వున్న లిస్టులో ఆఖర్న సినిమా కూడా వుంది. దీని ఐడియా... భలే బావుంది. తాను పూర్తిగా డబ్బులు ఖర్చు పెట్టేస్తాడేమోనని, దానికోసం కొంచెం వుంచమని జ్ఞాపకం చెయ్యడం అన్నమాట దాని అర్థం... 'ఆడవారి రాతలకూ అర్థాలే వేరులే' గొణుక్కున్నాడు సన్నగా.

అంతలో లచ్చినాణ ఆలోచన్లకు బ్రేక్ వేస్తూ కారు హారన్ మోగింది - వెనకనుంచి. ఒక్కసారి తుళ్ళిపడి, అసంకల్పిత ప్రతీకార చర్యగా ప్రక్కకు గెంతాడు.

## ఉద్యోగుల చేయూత !

జపానులో వివిధ పరిశ్రమల్లో పని చేస్తున్న ఉద్యోగులు తాము పనిచేస్తున్న కంపెనీల పురోభివృద్ధికి తగిన సలహాల నిస్తుంటారు. ఇటీవల యీ సలహాల సంఖ్య గణనీయంగా పెరిగినట్లు, యివి పారిశ్రామికాభ్యున్నతికి ఎంతో దోహదం చేస్తున్నట్లు తెలుస్తూంది. ఎలక్ట్రానిక్, విద్యుత్తు రంగాలలో పనిచేసేవారు సలహాల నివ్వడంలో అగ్రస్థానంలో ఉన్నారు. పొదుపు చర్యలు, నాణ్యతాభివృద్ధి, కార్మిక భద్రత, ప్రమాదాల నివారణ, ఉత్పత్తి ఖర్చుల తగ్గింపు గురించిన సలహాలు ప్రాధాన్యత వహిస్తున్నాయి. వీటిలో సగం అమలుపరచటం ద్వారా కొన్ని లక్షల డాలర్ల లాభం కలుగుతున్నది. ప్రయోజనకరమైన సలహాల నిచ్చినవారికి నగదు బహుమతులు ఇస్తారు.

అనుకోకుండా తక్కున తెగింది చెప్పు. ఇంకేవుందీ ? దాని పని అయిపోయింది. తెగిపోయి రిటైరైపోయింది. నో ! నో ! తన వైఖరి నచ్చక అదే రిజైన్ ఇచ్చేసింది.

ఇప్పుడు తన బాధ వర్ణనాతీతం. కాలు ఈడుస్తూ రెండడుగులు వేశాడు... అదేం - అందరూ తనవంక అలా వింతగా చూస్తున్నారేం ? వీళ్ళకి తనకి చూడ్డమే పనా ?...

అరె ! ఆ అమ్మాయిలంతా అలవోకగా నవ్వుకుంటున్నట్టున్నారే...

బోడెమ్మలు ముసిముసిగాను, కాలేజీ కుర్రాళ్ళు హేళనగాను, హైస్కూలు కుర్రాళ్ళు గట్టిగాను, బడి మాష్టారు బడబడా, తగువుపడ్డ ఇల్లాలు గలగలా, పరీక్షపోయిన కుర్రాళ్ళు కిలకిలా, ముసిలాయన బుగ్గ మూతి బిగించి మరీ నవ్వుకుంటున్నారు.

ఏం ? నడిబజార్లో వాళ్ళ చెప్పులెప్పుడూ తెగలేదా ? తెగితే వాళ్ళు బాధపడలేదా ? అప్పుడు నలుగురూ వాళ్ళని చూసి నవ్వుకోలేదా ?

అయినా తప్పు చెప్పుది. అది తెగిచచ్చింది. అది ఛస్తూ తన్నీ చంపింది. దానికి తానేం చెయ్యగలడు ?

ఎదురుగా బాటా షాపుమీద నియాన్ బూట్లు ఒక్కసారి వెలిగాయి.

'ఉండండ్రా ! మీ పని చెప్తాను. హన్నా ! నన్ను చూసి నవ్వుతారా ? వెధవది నా చెప్పు తెగిపోయిందనే కదూ మీరు నవ్వుతున్నారు. మీ నవ్వు కట్టించేస్తా...ఎన్ని అవసరాలున్నా వాటన్నిటినీ ఓ పక్కకిపెట్టి, ఓ మూలకి నెట్టి బూట్లు కొనేస్తా ! ...


ఇంట్లో ఆ రాస్కెల్ ఏమన్నావరే ! ... ఈ నెల్లాళ్ళూ ఎన్ని పడుకున్నావరే ! ... అప్పులాళ్ళు ఎగిరి మీదకి దూకి పీక పట్టుకున్నావరే !


కొనెయ్యాలి ! బూటు కొనేసి వీళ్ళందరికీ బుద్ధి చెప్పెయ్యాలి !

బాటా షాపులోకి దారి తీశాడు లచ్చినాణ.

చిన్నసైజు లాఠీకర్ర ఓ కొసకి జేబురుమాలు గుడ్డ సెట్‌చేసి దాంతో లేనిధూళి దులుపుతున్న ఓ పాతికేళ్ళ సేల్స్‌మెన్ 'రండి సార్ రండి సార్ రండి' అంటూ మొదటి పిలుపులోనే రెండు 'సార్లు' ఇరికించి గౌరవ వాచకంతో సాదరంగా సీటుమీద బైఠాయింపజేసేడు.

ఏటి కావాలని వాడడుగుతాడు. బ్లూటు కావాలంటాడు తాను. 'ఎంతలో?' అంటాడు వాడు. తనకి తెలిసినంతమేరకు 'ఓ పాతికా - అరవందా లోపున ఇమ్మంటాడు' తాను. తనని ఎగాదిగా చూసి 'ఇదెప్పుడూ బూటు ఎరిగున్న మొహంలా లేదు' అనుకొని వాడు పైన అరలోంచి తీస్తున్న బూట్లు కిందపడేసి 'అంత తక్కువలో బూట్లు వుండవు సార్' అంటాడు వాడు. 'మరెంతంటావ్' అని కూపీ లాగుతాడు తాను. వంద దగ్గర్లో చెప్తాడు వాడు. కాలికింద నలిగే చెప్పుకోసం కళకళా, తళతళా, ఫెళఫెళాలాడే వంద రూపాయల నోటు తగలెయ్యడమా ? అని ఆలోచిస్తాడు తాను. తన మౌనాన్ని అంగీకార సూచకంగా భావించి అన్ని అరల్లోంచీ ఓ పాతిక జతల బూట్లు, ఎగ్జిబిషన్లో పెట్టినట్లు తనముందు వుంచుతాడు. వాటి మెరుపూ, వాటి నునుపూ, వాటి టీపీ, అందులో దర్జా చూస్తూంటే తనకి ఆఫీసు బాస్ బెంగాలీ బాబు గుర్తొస్తాడు. మెరిసే నున్నటి వాడి బట్టతలా గుర్తొస్తుంది. ఏది కావాలో చూసుకోమనీ, ఎంచుకోమనీ సతాయిస్తాడు వాడు. తన నాన్చుడు వ్యవహారంతో వాడికి సహనం చచ్చిపోతున్నా, బిజినెస్సులో కోపతాపాలు పనికిరావన్న ప్రప్రథమ సూత్రం అంతలోనే గుర్తొచ్చి వాడు 'ఇది బావుంటుంది సార్ ! ఈ బూటు మీకు బాగా సూటవుతుంది సార్' అని సాధ్యమైనంత శాంతంగానే రికమెండ్ చేస్తాడు. నిజానికి వాడు సూచించిన సదరు బూట్ల జత బాగానే వుంటుంది. దాని ఖరీదు ఇంకా బాగుంటుంది. అంటే వందకు దగ్గర్లో చెప్తాడన్న మాట ! తాను చింతపండులాగ




బేరం చెయ్యబోతాడు. వాడు నిశ్శబ్దంగా కాష్ బాక్సుకు దగ్గర్లో పెట్టిన బోర్డులవేపు చూపిస్తాడు. అక్కడ టర్మ్స్ కాష్, ఫిక్సెడ్ రేట్స్, నో క్రెడిట్ లాంటి 'పెద్ద అర్థాల్నిచ్చే చిన్న పదాల బోర్డులు' నాల్గయిదు వుంటాయి. అందులో మధ్య బోర్డు తనలాటి వాళ్లకోసం ఉద్దేశించబడిందని వాడి తాత్పర్యం. అవన్నీ చూసేసరికి తనకి ఒళ్లు మండి పోతుంది. ఇలాటిదేదో జరుగుతుందని వాడు ముందే ఊహిస్తాడు కాబోలు — గుప్‌చుప్‌గా ఎప్పుడార్డరిచ్చేస్తాడో ఏమోగాని, సమయానికి సరిగ్గా కూల్‌డ్రింక్ ఒకటి తెప్పించి తనని ఐస్ చేసేసి కూల్‌గా మార్చేస్తాడు. దాంతో తాను చల్లబడిపోయి, చల్లగా ఓ వందనోటుకి నీళ్లధార వదిలేసి, చివర్లో వాడొదిలిన వెకిలినవ్వుని రిసీవ్ చేసుకుని, రిసీట్ తీసుకుని బయటపడతాడు తాను.

కూర్చున్న రెణ్ణిముషాల్లోనే ఇంతాలోచనా రీల్ తిరిగినట్టు గిర్రుమని తిరగ్గా, స్ప్రింగ్ యాక్షన్ వచ్చినవాళ్లాగ ఒక్కసారి లేచి చక్కా బయటికి వచ్చేశాడు లచ్చినాణ. వెనకనుంచి షాపువాడి పిలుపు మళ్లీ విన్పించకపోలేదు — అయినా సరే!

తెగిపోయిన చెప్పు కాళ్ల కడ్డంపడి, అడుగేయడానికి అంతరాయం కల్గిస్తోంది.

మళ్లీ అందరి చూపులూ తనకేసి తిరిగాయ్. మళ్లీ అందరి పెదాలపైనా అదే చిర్నవ్వు కదులాడుతూ కంటిన్యూ కాసాగింది.

'పెద్ద బాటు కొనేసేవాళ్లాగ షాపులోకి దూరేవ్. చేతకాక చచ్చు చెప్పుతోనే తిరిగి తగలడ్డావ్' అనుకుంటూన్నారు కాబోలు. అనుకోనీ! వాళ్లనుకుంటే మాత్రం తనకేమిట్ట నష్టం? అనుకున్నవాళ్లూ, నవ్వుకున్నవాళ్లూ తన బాధ ఆర్చగలరా? తీర్చగలరా? వాళ్లిష్టం వచ్చినట్టు నవ్వనీ.

ఇదేంవిటి? ఈ చెప్పు కూడా తెగివచ్చిందే! ఇప్పుడెలా?

'అయ్యయ్యో చేతికి చెప్పులు వచ్చెనే! అర్రెర్రే చాలా తిప్పలు వచ్చెనే!' ట్యూనింగ్ బిట్‌లో రిథమ్‌కి చిరుదరహాసం మెరిసింది లచ్చినాణ పెదవులమీద.

లచ్చినాణ అటూ ఇటూ చూశాదు...



# తెగిన చెప్పు

— దగ్గర్లో చెప్పులు కుట్టే చమారీ వెధవ ఎవడైనా తగలడ్డాడేమోనని.

పాతిగ్గజాల దూరంలో ఓ బక్క ఆకారం సగం కోసిన పాతటైర్ల మధ్యా—రిపేరు చెయ్యాల్సిన చిన్నసైజు చెప్పులగుట్ట మధ్యా పనిలో నిమగ్నమై వుంది.

అక్కడికి వెళ్లాలి తాను...

చెప్పులు తన కాళ్ల నొదిలేసి దిక్కులేని శవాల్లా రోడ్డువార్న ఆగిపోయాయి. కాళ్లుపెట్టి ఈడ్చినా, తన్నుకుంటూ వెళ్లినా రామనేస్తున్నాయి.

లాలించి, బుజ్జగించి చేతుల్లోకి తీసుకోక తప్పదంటున్నాయి. సరే! వాటి కోరిక నెందుక్కాదనాలని చెప్పులు చేత్తో పట్టుకొని, వాడి దగ్గరకు నడక ప్రారంభించాడతడు.

చేతుల్లో వున్న చెప్పులు జ్వరం తగిలిన పిల్లాడు మాటిమాటికీ మెడకాయ వాల్చేస్తున్నట్లు, వ్రేళ్లాడిపోతున్నాయ్.

ఆ స్థితిలో లచ్చినాణని చూసిన ఇందాకటి జనమంతా వెయ్యి గొంతుకలతో వికృతంగా నవ్వుతున్నారు గట్టిగా... గోలగా... పగలబడి... విరగబడి నవ్వుతున్నారు.

'నవ్వుతున్నారు. నన్ను నవ్వులపాలు చేస్తున్నారు' అనుకుంటూ నడుస్తున్న లచ్చినాణ వడివడిగా చమారీ వాడి దగ్గరకు పరుగుతీశాడు.

## చెలియలికట్ట

విప్పారి వాసనల్ గుప్పుచు న్నున్న
సూనంబులన్ జూడ నానంద మొదవు;
వన్నెలు చెడి నేలబడి వాడియున్న
అలిరుల జూడ మమ్మలికమ్మ కలుగు;
సంతోష సంతాప సాగరమ్ములకు
కూలముల్ నిర్మింప జాలదా మనసు?
అశ్రవ మందస్మితార్ణవమ్ములకు
చెలి యలికట్ట రచించును పెదవి!

— వఝల కాళిదాసు

నాలుగు అంగల్లో అక్కడికి చేరుకొని, చేతిలోని చెప్పుల్ని కిందపడేసి "ఇవి కుట్టిపెట్టు కాస్త" అన్నాడు.

దీక్షగా కుడుతున్న చెప్పును అవతంపెట్టి, కొత్త బేరం టేకప్ చెయ్యడానికి తలెత్తాడు చమారీవాడు.

వాట్ని చూడగానే రిపేరింగ్ కేసు తీసుకోవాలన్న ఆసక్తి — ఆశా చచ్చిపోయాయి వాడిలో.

ఏంచెప్పాలో తోచక 'నాబంనేద్సార్! అట్టుకు పోండి' అని ఒక్క ముక్కలో చెప్పేశాదు వాడు.

"అంటే?" అర్థంకాక అడిగేదు లచ్చినాణ.

"అంటేనా?... ఇంకేటియు కుట్టనానిక్కూడా పనికిరావనినెక్క" అనిని వాడు తన అభిప్రాయం ప్రకటించీసేదు ఓపెన్‌గా.

"అయితే ఏమిటంటావ్! కావాలంటే రూపాయిస్తాను. వాట్ని కాస్త రిపేర్ చేద్దూ!" బ్రతిమలాడబోయేదు లచ్చినాణ.

"మీ రూపాయికో దణ్ణం కాని, దయసెయ్యండి బాబూ! నావొల్లగాదు. ఆ రూపాయిమీద ఇంకో లొమ్ది రూపాయిలెట్టి అవాయి సెప్పులు కొనుక్కోండి" సలహా జెప్పేదు వాడు.

"ఇంతకీ వీటనేం చెయ్యమంటావ్?" లచ్చినాణ అడిగేదు.

"అదికూడా నానే సెప్పాలా బావ్! అటి సారివీసు సరి. సార్వీసయిపోయినోల్లని ఏటజేత్తారు బాబూ? రిటైర్మెంటిచ్చి ఇంటికి తోలేత్తారా నేదా? ఈట్ని అంతే సెయ్యాల! తీసిపెట్టి యిసిరి సైడు కాలవలోకి గిరాటు కొట్టేయాల" తక్షణ కర్తవ్యం బోధించాడు వాడు.

"ఆ ఏనేదో నువ్వే చేద్దూ" అనేసి నిరసంగా అక్కడ్నుంచి కదిలాడతడు.

తెగిన చెప్పులు దీనంగా చూశాయి లచ్చినాణ వంక.

వాటి మొహం చూడలేక లేక వాటికి మొహం చూపించలేక, తెగిన చెప్పులాంటి తన డెయిలీ లైఫ్‌కి అడ్జెస్ట్‌మెంట్స్ అనే అతుకులు వేసుకోడానికి ఇంటి దిక్కుగా బయల్దేరేడతడు.

ఇప్పుడతని కాళ్లు ఎంతో ఫ్రీగా, రిలీఫ్‌గా వున్నట్లనిపించాయి. ★